క్లుప్తంగా

వినాయక చవితికి పందిరి రాట


పందిరి రాట వేస్తున్న మహిళలు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు కుంచుమాంబ కాలనీలో ఆదివారం వినాయక చవితి ఉత్సవాలకు పందిరి రాట కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 18 నుంచి వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేందుకు, మండపంలో స్వామిని నెలకొల్పేందుకు అవసరమైన పనులకు స్థానిక మహిళలు పందిరి రాట వేశారు. 61వ వార్డు ప్రకాష్‌నగర్, జనతా కాలనీ, ఇండస్ట్రియల్ కాలనీల్లో పందిరి రాట కార్యక్రమం చేపట్టారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం


అవార్డులు పొందిన ఉపాధ్యాయులతో ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, బాలమోహన్‌దాస్

సీతంపేట: బాలవికాస్ ఫౌండేషన్, గాంధీ సెంటర్ సంయుక్తంగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన నలుగురిని సత్కరించారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన మురహరిరావు ఉమాగాంధీ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన కె.వి.ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, కొట్టాన రాంబాబు, విజయ్ సుశీల్ కుమార్‌లను ముఖ్య అతిథి సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు చేతుల మీదుగా సత్కరించారు. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు,బి.రామారావు, ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భద్రం పార్కులో హనుమాన్ చాలీసా


హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న భక్తులు

ఎంవీపీ కాలనీ: స్థానిక భద్రం పార్కులో పలువురు ఆధ్యాత్మికవేత్తలు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. భారతదేశ సనాతన ధర్మ రాజ్య స్థాపనలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సామవేదం షణ్ముఖ శర్మ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. హిందూ ధర్మ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం 108 సార్లు హనుమాన్ చాలీసా యజ్ఞాన్ని నిర్వహించారు. చింతామని భజన బృందంతో పాటు కర్ణాటక సంగీత విద్వాంసులు గుమ్ములూరి శారదా సుబ్రహ్మణ్యం తదితరులు వేయి మంది భక్తులతో హనుమాన్ చాలీసా సహస్ర గళార్చన చేయించారు. కందాళ వెంకట సత్యశ్యామ్ పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం నగరానికి చెందిన కె.కుమార్ దంపతులు లక్ష 116 రూపాయల విరాళం అందజేశారు. అలాగే స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. దేవస్థానం తరఫున సూపరింటెండెంట్ అన్నప్రసాద పథకం బాండ్ దాతకు అందజేశారు.

కండలతో ఖండాంతరాలు దాటి..

బాడీబిల్డింగ్‌లో హేమంత్ అంతర్జాతీయ ఖ్యాతి


మిస్టర్ ఆసియా 55వ బాడీబిల్డింగ్ పోటీల్లో పతాకాన్ని అందుకుంటున్న హేమంత్‌కుమార్


నేపాల్‌లో గెలిచి తిరిగి విశాఖ వచ్చిన హేమంత్‌కుమార్‌కు ఘనస్వాగతం పలుకుతున్న తోటి బిల్డర్లు

సింథియా: కృషి, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని గిన్ని హేమంత్‌కుమార్ నిరూపించాడు. బాడీబిల్డింగ్‌లో అంతర్జాతీయస్థాయిలో సత్తా చాటుతున్నాడు. పేదింట్లో పుట్టినా.. దేశం గర్వించే స్థాయికి ఎదిగాడు. బలంగా లక్ష్యాన్ని నమ్ముకుంటే పేదరికం అడ్డుకాదని చాటిచెప్పాడు.

జీవీఎంసీ 62వ వార్డు అల్లూరి సీతారామరాజు కాలనీకి చెందిన గిన్ని హేమంత్‌కుమార్ బాడీబిల్డింగ్‌లో విశేషంగా రాణిస్తున్నాడు. చిన్నతనం నుంచి వ్యాయామంపై ఉన్న ఆసక్తితో పేదరికాన్ని పక్కన పెట్టి ఇంటి వద్దే శిక్షణ పొందుతూ అంతర్జాతీయ వేదికపై ప్రదర్శన ఇవ్వాలనుకున్న కలను నెరవేర్చుకున్నాడు. నేపాల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ మిస్టర్ ఆసియా 55వ బాడీ బిల్డింగ్ కాంపిటేషన్ 60 కేజీల విభాగంలో 5వ స్థానంలో నిలవడమే కాక.. మిస్టర్ ఇండియా బాడీబిల్డింగ్ పోటీల్లో సైతం గెలిచి శభాష్ అనిపించుకున్నాడు. పారిశ్రామిక ప్రాంతం ఏఎస్సార్ కాలనీలో ఉంటున్న హేమంత్‌కుమార్ జిల్లాలోనే కాదు, రాష్ట్రంలో ఎక్కడ బాడీ బిల్డింగ్ పోటీలు జరిగినా పతకాలు సాధిస్తూ వస్తున్నాడు.


ప్రదర్శనలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్న హేమంత్‌కుమార్

తల్లిదండ్రుల ప్రోత్సాహం

నగరంలోని బుల్లయ్య కాలేజీలో బీఎస్సీ చదివిన హేమంత్‌కుమార్ తండ్రి గిన్ని తులసీరాజు హెచ్‌పీసీఎల్ పరిశ్రమలో రోజువారీ కార్మికుడిగా పనిస్తుండగా.. తల్లి భాగ్యలక్ష్మి గృహిణి. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో హేమంత్‌కుమార్ పారిశ్రామిక ప్రాంతంలోని జాతీయ స్థాయి బాడీబిల్డర్ గౌరినాయుడు వద్ద శిక్షణ పొందాడు. 2020 నుంచి పోటీల్లో పాల్గొంటూ అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు.

అనుకున్నది సాధిస్తూ..

23 ఏళ్ల హేమంత్‌కుమార్ ఇప్పటి వరకూ 4 సార్లు మిస్టర్ విశాఖగా నిలిచాడు. 2023లో ఉత్తరాఖాండ్‌లో జరిగిన మిస్టర్ ఇండియా పోటీల్లో 60 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ నెల 4వ తేదీన నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ బాడీ బిల్డింగ్ పోటీల్లో ఏపీ నుంచి హేమంత్‌కుమార్ అర్హత పొంది సుమారు 45 దేశాల క్రీడాకారులతో పోటీపడి భారతదేశాన్ని 5వ స్థానంలో నిలబెట్టాడు. భవిష్యత్తులో మిస్టర్ వరల్డ్ పోటీల్లో పాల్గొని భారత్ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలనుకుంటున్నాడు. దాతలు, ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధిస్తానని చెబుతున్నాడు.

ఒకే వేదికపై ఆరు తరాలు


ఆఖరి కుమారుడు వరహాలశెట్టిని సత్కరిస్తున్న కుటుంబ సభ్యులు

పరవాడ: మానవ సంబంధాలు మంట కలిసిపోతున్న తరుణంలో ఆరు తరాలకు చెందిన కుటుంబ సభ్యులు ఒకే వేదికపై కలుసుకొని ఆత్మీయత అనురాగాలు పంచుకున్నారు. ఆ అపురూప ఘట్టం పరవాడ మండలం వాడచీపురుపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. వాడచీపురుపల్లి గ్రామానికి చెందిన దివంగత గుండా నాగరాజుకు చెందిన ఆరు తరాల వంశ వృక్షం ఒకే వేదికపై కలుసుకోవడంతో గ్రామంలో సందడి నెలకొంది. వైశ్య కుటుంబానికి చెందిన దివంగత గుండా నాగరాజుకు ఏడుగురు కుమారులు, కుమార్తెలు కాగా వారి ద్వారా వృద్ధి చెందిన కుమారులు, కూతుళ్లు, అల్లుళ్లు, కోడళ్లు, మనవలు, మునిమనవలంతా ఆదివారం గ్రామంలో ×గుండా నాగరాజు గారి కుటుంబ సమ్మేళనం× నిర్వహించారు. సుమారు 345 మంది సభ్యులు కలుసుకొని ఆత్మీయత అనుబంధాలను గుర్తు చేశారు. దివంగత గుండా నాగరాజుకు గుండా నరసింహమూర్తి, రాంబాబు, మాణిక్యలరావు, బాపారావు, సత్యనారాయణమూర్తి, వరహాలశెట్టి, కె.సరోజిని సంతానం. వీరిలో ఆఖరి కుమారుడు గుండా వరహాలశెట్టి మాత్రమే ఉన్నారు. తద్వారా ఏర్పడిన వంశవృక్షమే వీరంతా. కొందరు డాక్టర్లు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో స్థిరపడ్డారు. వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డ వీరంతా ఓ చోట చేరి తమ ఆత్మీయత అనురాగాలను నెమరువేసుకొన్నారు. యువత ఉత్సాహంగా డ్యాన్సులు చేసి సందడి చేశారు. అన్నా తమ్ములు, అక్కా చెల్లెళ్ల మధ్య సన్నగిల్లుతున్న ఆత్మీయత అనురాగాలను నేటి సమాజానికి గుర్తు చేయాలన్న ఉద్దేశంతో ఈ ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశామని గుండా వరహాల శెట్టి చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ రోడ్‌లో చెట్ల కొమ్మల తొలగింపు

విశాఖ విద్య: ఎన్ఏడీ నుంచి ఎయిర్ పోర్ట్‌కు వెళ్లే రహదారిలో ప్రమాదాల నియంత్రణపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన రోడ్లపైకి వచ్చిన చెట్ల కొమ్మలను జీవీఎంసీ సిబ్బంది సహకారంతో ఆదివారం తొలగించారు. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా, రహదారిలో ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఇటువంటి ఏర్పాట్లు చేసినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. అదే విధంగా కాకాని నగర్ నుంచి ఎయిర్ పోర్ట్ వరకు రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించేలా బారి కేడ్లు ఏర్పాటు చేశారు.


చెట్లు కొమ్మలు తొలగింపజేస్తున్న సిబ్బంది

గణపతి ఉత్సవాల్లో గొడవలు సృష్టిస్తే చర్యలు

మల్కాపురం: మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ జి.డి.బాబు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు సమీపిస్తున్న వేళ.. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లంతా జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి అల్లర్లకు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వినాయక మండపాల వద్ద రౌడీషీటర్ల వల్ల ఎటువంటి ఇబ్బందికర పరిస్థితి తలెత్తకుండా ఉండేందుకు వారికి పలు సూచనలు, హెచ్చరికలు చేశారు. మండపాల వద్దకు వెళ్లి పెత్తనం చేయడం, నిర్వాహకులను బెదిరించటం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గణపతి ఉత్సవాల్లో శాంతియుతంగా మెలగాలని, ఎవరైనా రౌడీషీటర్లపై ఫిర్యాదు చేసినా, తన దృష్టికి వచ్చిన క్షమించేది లేదన్నారు.


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ జి.డి.బాబు

నిరుపేదలకు సేవలందించడం అభినందనీయం

దాబాగార్డెన్స్ : నిరుపేదలకు సేవలందించటం అభినందనీయమని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ పేర్కొన్నారు. మోర్చ చిన్నమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరాశ్రయులకు సేవలందిస్తున్న ట్రస్ట్ చైర్మన్ మోర్చ సన్యాసిరావు (సన్నీ)ని ప్రశంస దీపిక కల్చరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ హాల్లో ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో పాల్గొన్న దాడి సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వద్ద పని చేస్తూ నిరుపేదలకు తన వంతు సాయంగా సేవలందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో లివింగ్ స్టన్ ట్రస్ట్ సభ్యుడు నరేంద్ర కుమార్, ప్రకాష్, మాఉపాధ్యక్షుడు, సినీ నటుడు రవితేజ, మాదాబత్తుల రమేష్, గోపాలకృష్ణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


సన్నీని సన్మానిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సింహాచలం: ఏకాదశి పురస్కరించుకుని ఆదివారం సింహగిరి భక్తులు పోటెత్తారు. గిరిపై ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక సందడి కనిపించింది. అప్పన్నకు ఆర్జిత సేవలు వైభవంగా జరిపారు. ఉదయం 7 నుంచి స్వర్ణతులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. అష్టోత్తర శత నామావళిపూజ నిర్వహిస్తూ 108 స్వర్ణతులసీ దళాలతో అర్చన చేశారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విశేషంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.


తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీ వరాహ లక్ష్మీనృసంహస్వామికి గరుడసేవ వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.

అలరించిన సినీ సంగీత విభావరి

సీతంపేట: ఎల్ఎఫ్‌సీ మ్యూజికల్ ఫ్యామిలీ బ్యానర్‌పై ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన సినీ సంగీత విభావరి ఆహుతులను అలరించింది. గాయనీ గాయకులు కరకవలస భాస్కర్, కె.అరుంధతి, కుమారి, జోషిత, సాత్విక ఆలపించిన సినీ గీతాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. కార్యక్రమంలో దర్శకులు రెడ్నం యాడ్‌కుమార్, జి.వి.త్రినాథ్, గిన్నిస్ రికార్డు హోల్డర్ కోరుకొండ రంగారావు పాల్గొన్నారు.


సినీ గీతాలు ఆలపిస్తున్న గాయనీమణులు

బంధనాలు కాదు.. రక్షణ కవచాలు!


బాజీ జంక్షన్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల ముందు పరిస్థితి ఇలా


సందులోంచి ద్విచక్రవాహనాలతో ఇలా..

- బాజీ జంక్షన్‌లో ట్రాఫిక్ ఆంక్షలు
- ప్రమాదాల నియంత్రణపై పోలీసుల ప్రత్యేక శ్రద్ధ
- నిర్లక్ష్యం వీడని వాహన చోదకులు

విశాఖ విద్య: ఎన్ఏడీ నుంచి పెందుర్తికి వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్‌లో ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు నడుంబిగించారు. బాజీ జంక్షన్‌లో వాహనదారులకు ఇబ్బందులు తొలగించేలా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. పెందుర్తి మార్గంలో ఇటీవల వాహనాల రద్దీ భారీగా పెరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, కర్మాగారాల్లో విధులకు వెళ్లేవారు, పాఠశాలలు, కాలేజీలకు విద్యార్థులతో వెళ్లే వాహనాల కారణంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ముఖ్యంగా బాజీ జంక్షన్‌లో వాహనాలు ముందుకు సాగక, ఎన్ఏడీ ఫ్లై ఓవర్ వరకు కూడా ఒక్కో సారి ట్రాఫిక్ జామ్ అవుతుంది. దీని వల్ల వాహనదారులు సకాలంలో గమ్యం చేరుకోలేకపోతున్నారు. సమయానికి వెళ్లాలనే హడావుడిలో నిబంధనలను అతిక్రమించి ముందుకు కదులుతున్న వాహనాలతో తరచూ ఆ ప్రాంతంలో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. ఇలాంటి వాటికి అడ్డకట్ట వేసేలా ట్రాఫిక్ సీఐ కె. అశోక్ కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, ఉన్నతాధికారుల అనుమతితో బాజీ జంక్షన్‌లో నివారణ చర్యలు చేపట్టారు. బాజీ జంక్షన్‌లో వాహనాలను క్రమబద్ధీకరించే క్రమంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీని వల్ల సువర్ణ కాలనీ, పాత గోపాలపట్నం నుంచి వచ్చే వాహనదారులు కూడా కొద్దిగా ముందుకెళ్లి సప్తగిరి సెంటర్‌లో యూటర్న్ తీసుకొని వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఇటువంటి చర్యలతో ప్రమాదాలు నివారణకు అవకాశం ఉంటుందని సీఐ అశోక్ తెలిపారు. వాహనదారులు, వ్యాపారస్తులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

ఇలా అయితే ఎలా?

బాజీ జంక్షన్‌లో ప్రమాదాల నివారణ కోసం బారికేడ్లు ఏర్పాటు చేసినా కొంతమంది వాహనదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బారి కేడ్లు తోసుకొని చిన్నపాటి సందులో నుంచి ద్విచక్రవాహనాలను ముందుకు పోనిస్తున్నారు. దీని వల్ల ఎన్ఏడీ సెంటర్ నుంచి పెందుర్తి వైపు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలకు ఆటంకం కలుగుతుంది. బారి కేడ్లను బంధనాలుగా భావించకుండా.. ప్రాణాలకు రక్షణ కవచాలుగా భావించాల్సిన అవసరం ఉందని ట్రాఫిక్ పోలీసులు కోరుతున్నారు.

సహజ యోగాతో సుఖమయమైన జీవితం


సహజ యోగ మందిరం పూజలు చేస్తున్న సహజ యోగులు

దాబాగార్డెన్స్ : ప్రతి ఒక్కరూ సహజ యోగాను క్రమం తప్పకుండా ఆచరించి ఆనందకరమైన, ఆరోగ్యప్రదమైన జీవితాన్ని అనుభవించాలని సహజ యోగులు ధర్మసాయి, సుభాషిణి, రమేష్ పద్మావతి తెలిపారు. ఆదివారం నగరంలోని సహజ యోగ ధ్యాన మందిరం ప్రారంభ కార్యక్రమంలో మందిరం స్టేట్ కో ఆర్డినేటర్ కె. స్వామి బాబు, నేషనల్ ట్రస్ట్ మెంబర్ టి. మధుసూదన్ రావు, ట్రస్ట్ వైస్ చైర్మన్ ఎం. రమేష్ పాల్గొని మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మనిషి నిత్య జీవితంలో అనారోగ్య సమస్యలు దరి చేరకుండా ఉండాలంటే గంట పాటు సహజ యోగా తప్పని సరిగా చేయాలన్నారు. నేటి యాంత్రిక జీవనంలో సహజ యోగం మనిషి జీవన ప్రమాణాన్ని పెంపొందించేందుకు, ఒత్తిడిని జయించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నేటి ఆధునిక యుగంలో ఒత్తిళ్లకు గురవుతున్నారని, వాటిని జయించేందుకు సహజ యోగ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాతాజీ నిర్మలాదేవి, రమేష్, సోంబాబు, మధుసూదన్, ధర్మసాయి, కెప్టెన్ బాబూరావు, పలువురు సహజ యోగులు పాల్గొన్నారు.

బాజీ జంక్షన్‌లో బారికేడ్లు తొలగించాలి

విశాఖ విద్య: ఎన్ఏడీ కూడలి సమీపంలోని బాజీ జంక్షన్ వద్ద రహదారి కుడివైపు ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన బారి కేడ్లు తొలగించాలని సీపీఎం గోపాలపట్నం డివిజన్ కార్యదర్శి బి. వెంకటరావు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో శనివారం బాజీ జంక్షన్‌లో కొద్దిసేపు ధర్నా నిర్వహించారు.బారికేడ్లు ఏర్పాటు చేయటం వల్ల బుచ్చిరాజుపాలెం, శ్రీనివాసనగర్, లక్ష్మీనగర్ , సువర్ణ కాలనీ వాసులకు తీవ్ర అసౌకర్యంగా ఉందన్నారు. వీటిని వెంటనే తొలగించాలని ఎయిర్ పోర్ట్ ట్రాఫిక్ సీఐ అప్పారావుకు వినతి పత్రం అందజేశారు. పార్టీ నాయకులు ప్రభావతి, అనసూయ, సత్యవేణి, సత్యనారాయణ, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఘనంగా ‘నే...నే...నీతోనే ఉంటా’ ప్రీ రిలీజ్ వేడుక

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలోని బాలకృష్ణ కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం నే...నే...నీతోనే ఉంటా ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. శ్రీ విజయ కల్యాణ్ క్రియేషన్స్ బ్యానర్‌పై శ్రీనివాస్ కల్యాణ్, చైతన్య హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు మాజీ డిప్యూటీ మేయర్, ఏపీ మా అసోసియేషన్ ప్రెసిడెంట్ దాడి సత్యనారాయణ హాజరై చిత్ర యూనిట్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైరెక్టర్ కమ్ హీరో శ్రీనివాస్ కళ్యాణ్ పర్యవేక్షణలో మొదటి చిత్రంగా తెరకెక్కుతున్న నే...నే...నీతోనే ఉంటా విజయవంతం కావాలని అకాంక్షించారు. శ్రీ విజయ కళ్యాణ్ క్రియేషన్స్ బ్యానర్‌పై మరెన్నో మంచి చిత్రాలు తెరకెక్కాలని, మరెందరికో ఉపాధి లభించాలని ఆకాంక్షించారు.


ప్రీ రిలీజ్ వేడుకల్లో పోస్టర్ అవిష్కరిస్తున్న దాడి సత్యనారాయణ తదితరులు

ఎర్నిమాంబకు ఏకాదశి పూజలు

కంచరపాలెం : జ్ఞానాపురం పరిధి కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం శ్రావణ మాస శుద్ధ ఏకాదశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 దర్శనాలు కల్పించారు. ఈ నేపథ్యంలో వర్షాలు పడుతుండడంతో క్యూలైన్‌లో షెడ్లు నిర్మించాలని భక్తులు కోరారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, జోజిబాబు తదితర సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు


రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించా రు. సమాజంలో మద్యం షాపుల వద్ద అల్లర్లు చేయకుండా ఉండాలని, తగాదా ల్లో తలదూర్చకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించా రు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా జీవించా లని హితవు పలికారు. అనంతరం రౌడీషీటర్ల ను వారి ఇళ్ల వద్ద పోలీస్ సిబ్బంది అప్పగించారు.